కాలక్షేపానికి ఓ కథ

# ముసలమ్మ మరణం

యన్. ఆర్. నంది

ఇవాళ కూడా ముసలమ్మ అరగంట ఆలస్యంగా కంపెనీ చేరుకొనేసరికి కంపెనీ మేనేజరు ఆమెను పనినించి తీసేశాడు. ఆయనకి కావలసింది తన పని గాని, ఇలాంటి ముసలాళ్ళ మీద జాలీ దయా కాదు... ముసలమ్మ ఏమీ మాటాడకండా వెనక్కి తిరిగిపోయింది.

తన గుడిసె చేరుకొనేసరికి పక్కింటి వెంకన్న కొడుకు, రాముడు గబగబా ముసలమ్మ దగ్గరకివచ్చి "ఏంమామ్మా, ఇంత త్వరగా వచ్చేశావ్?" అని అడిగాడు.

"నన్ను పనిలోంచి తీసేశారుబాబూ" అంటూ ముసిల్ది గుడిసెలోపలికి వెళ్ళింది. రాముడు గూడ ఆమెతోబాటు లోపలికి వెళ్ళాడు.

"ఐతే మంచిదేకదు మామ్మా? ఇంకెప్పుడూ యిక్కడే వుండి నాకు కథలు చెప్పొచ్చు" అన్నాడు, వాడు ఆనందంతో.

ముసలమ్మ గెంతుతున్న రాముడికేసి నవ్వుకొంటూ చూసి బయటికి మళ్లా దారితీసింది.

"ఎక్కడికి మామ్మా?" అని ప్రశ్నించాడు, తిరిగి కంపెనీకి వెళ్ళిపోతుందేమోనని.

"శేషనుషాపులో బియ్యానికి..., రా, నీకూ రావాలని వుంటే..."

మామ్మ ఆహ్వానించడమే తడవుగా రాముడు మామ్మ చెయ్యిపట్టుకొని శేషను దుకాణంకేసి బయలుదేరాడు. మామ్మ ఒక్కర్తీ ఆగుడిసెలో బతుకుతోంది. కొడుకుల్లేరు, కూతుళ్లులేరు. అసలు 'నా' అన్నవారెవరూ లేరు. పుగాకు కంపెనీలో పనిచేస్తూ వచ్చిన నాలుగు కూలిడబ్బులతో ఆ చిన్న గుడిసెలో గంజి కాచుకొని జీవిస్తోంది. ఇప్పుడు పనిపోయింది. పెట్లో ఒక రూపాయుంటే, అది తీసుకొని బియ్యం కొనడానికి బయలుదేరుతోంది. ఈ రూపాయతో ఇక ముసలమ్మ కూలిచేసి కూడబెట్టుకొన్న డబ్బులు పూర్తిగా ఐపోతవి. మరిక తర్వాత పస్తే.

అవును, పస్తే అని ఆ ముసలమ్మకీ తెలుసు. ఒక్కొక్కప్పుడు మూడు పూటలూ పస్తుండి మడతకుడుములు తిన్నా- ఎందుకీ వెధవ జన్మ, ఏనూతిలోనో, గోతిలోనో పడి ఛస్తే మంచిది- అనే భావమే ఎప్పుడూ ఆమెకి కలగలేదు. ఆ కాలం వొచ్చేవరకు తను బతికుండాలనే మూఢ నమ్మకంతోనే బతుకుతోంది.

శేషను దుకాణంలో బియ్యం అయిపోయాయి. ముసలమ్మ రాముణ్ణి తీసుకొని వెనక్కి వచ్చేసింది.

గుడిసెలోకి వెళ్ళింతర్వాత మామ్మ కుక్కిమంచంలో కూలబడింది. రాముడు ఆమెపక్కనే కూచొన్నాడు.

"మామ్మా, నిన్న చెప్పిన కథ యిప్పుడు పూర్తిగా చెప్పవూ?" అని అడిగాడు రాముడు.

"అవునవును. మరచేపోయానామాట. ఎంతవరకూ చెప్పాను?" అంది.

"రైతు దూ దూ అని కుక్కల్ని పిలచాడు. పదికుక్కలు అక్కడికి చేరి రైతు చేతిలోని ఎంగిలిముద్ద కోసం తోకలాడిస్తూ తలలెత్తి కంగారు పడుతున్నాయి. రైతుకి కొస్త దూరంలో ఒక ముసలికుక్క గూడ ఆ ముద్ద కోసమే తోకాడిస్తోంది గాని దగ్గరకి రాలేక పోతోంది..." అంటూ రాముడు చెబుతున్నాడు.

"రాలేకపోవడం కాదు బాబూ, ఈ కుక్కలు రానివ్వటం లేదు."

"రానివ్వటం లేదూ? ఎందుకు మామ్మా?" ఆతృతగా ప్రశ్నించాడు.

"మరి అదిగూడ వచ్చిచేరితే పదకొండు కుక్కలవుతవి కదూ, అందుకు."

"అయితే మాత్రం?"

"అది గూడ వచ్చి కలిస్తే వీట్ల వాటా కొస్త తగ్గిపోతుంది కదూ?"

ముసలికుక్క కలిసినంతలో ఈ పదికుక్కల

పాటూ ఎలాతగ్గిపోతుందో రాముడు వూహించ లేకపోయాడు.

"అయితే దాన్ని నేను తీసుకొని పెంచుకొంటాను" అన్నాడు చివరికి, ఇది కథ అని మరచి.

ముసలమ్మ నవ్వింది.

"ఐతే ఆకుక్క బదులు నన్ను పెంచుకో"

"నిన్నా?" పకపకా నవ్వాడు రాముడు. "నిన్నెలా పెంచుకోవాలి మామ్మా?" అన్నాడు.

"సరేలేఆమాటవిడిచిపెట్టు. ఇకకథవిను."

"కథ వింటానుగాని మామ్మా, ఇన్నికథలు నువ్వెలా నేర్చుకొన్నావు?"

"నాకు వయస్సు నేర్పించింది బాబూ! మీ నాన్నంత పెద్దవాడివయితే నువ్వూ నాలాగు కథలు కొత్తకొత్తవి చెప్పగలవు."

"ఛా! నాన్నంత పెద్దవాణ్ణయితే నేను పొలాల్లో కష్టపడి బియ్యం పండిస్తానుగాని కథలు చెపుతూ కూచుంటా నేవిటి?...మరి మా నాన్న చూడు ఎప్పుడయినా నీలా కథలు చెబుతాడేమో? సరేగాని మామ్మా, పొద్దుట నీకు కొస్త చద్దన్నం తేవాలనుకొని నేను తినకండా దాచాను. ఇప్పుడు వెళ్ళి తెస్తాను. తింటావుకదూ?" అన్నాడు నిలబడి.

ముసలమ్మ నవ్విందిగాని సమాధానం ఏమీ చెప్పలేదు. రాముడు పరుగెత్తుకపోయి, మరో నిమిషంలో మూకుడుతో కొస్త గంజి తీసుకొచ్చాడు.

"మామ్మా, అన్నమంతా అమ్మ చిన్న తమ్ముడికి పెట్టేసింది ఇంట్లో. ఇక అన్నంలేదు. గంజి తెచ్చాను. తాగు మామ్మా" అంటూ మూకుడుని అందించాడు. ముసలమ్మ ఆత్రుతగా ఆ గంజిని తాగి మూకుడు రాముడికిచ్చింది. రాముడు మూకుడు తీసుకొని వెళ్ళిపోయాడు.

ముసలమ్మ పక్కనున్న రేషను కార్డుకేసి చూసింది. తల పైకెత్తింది. ఇప్పుడే తాగినగంజి కడుపులోకి వెళ్ళి కొస్త తృప్తినిచ్చింది. ఒక తేన్పుగూడ వచ్చింది. రాముడు తిరిగి వచ్చాడు మరో గంటలో.

"మామ్మా, సాయంకాలం నేను అక్కయింటికి పట్నం వెడతాను" అన్నాడు. ముసలమ్మ సరేఅన్నట్టు తలూపింది. రాముడు కాసేపు మామ్మతో కబుర్లాడి తర్వాత యింటికి వెళ్ళిపోయాడు.

ఆ సాయంకాలం రాముడు వాళ్ళ అక్కింటికి రాజమండ్రి, అమ్మ, నాన్న, తమ్ముళ్ళతో కలసి వెళ్ళిపోయాడు.

* * *

నాలుగు రోజులయింది. రాముడు యింకా తిరిగి రాలేదు. ముసలమ్మ మంచంమీద పడి వుంది. పక్కనే రేషను కార్డు వుంది. ఆమెకి దూరాన ఎండలో మెరుస్తున్న వరిపొలాలు అగుపిస్తున్నాయి. కాని కళ్లెత్తి చూడలేక పోతోంది. కడుపు లోపలికి పోయింది.

"మామా, మామ్మా... నేను అక్కయ్యని తీసుకొని" అంటూ రాముడు గుడిసెలోకొచ్చి, చచ్చినట్టు పడున్న మామ్మని చూసి, కంగారుగా పక్కకిపచ్చి, "మామ్మా, మామ్మా" అని కదిపాడు.

"బాబూ, రాముడూ... నిన్ననే ఆ ముసలి కుక్క చచ్చిపోయింది. పాకీవాళ్ళు దాన్ని ఈడ్చేశారు. ఇక కథ పూర్తి అయిపోయినట్టే. ఈ కార్డు తీసుకొని నాన్నకియ్యి" అంటూ రేషనుకార్డు రాముడికిచ్చింది.

"ఎందుకు మామ్మా, నాన్న పొలంలో కావలసినంత ధాన్యముందిగా?"

"పిచ్చినాయనా! ధాన్యమున్నంతలోసరా? అది నోట్లోకి రావడానికి ఎన్ని పన్నులు చెల్లించాలో నీకు తెలీదు. చెల్లించినా అది అధికారుల స్వాధీనమవాలి. అందువల్ల ఈ కార్డు తీసుకొని, దొంగతనంగా బియ్యం తెచ్చుకోండి."

"మరి నీకు?"

"నేను చచ్చిపోతాను. నాలాంటి వాళ్లు లక్షల మంది ఛస్తేనేగాని, కథలు కాలక్షేపానికి వినే నీలాంటివాళ్లు బతకలేరు బాబూ. నేను బతికుండి ఆ ముసిలి కుక్కలా మీ వాటాల్లో కొస్తకొస్త లాక్కుంటున్నాను..." అంటూనే ముసలమ్మ కళ్లు మూసుకుంది.

"మామ్మా...మామ్మా" అంటూ ఏడ్చాడు రాముడు.

ఆ వీధివాళ్లు చందాలెత్తి ముసలమ్మని మట్టిచేశారు. కాని పాకీవాళ్లు చచ్చిన ముసలికుక్కని దూరంగా పారేయకండా అక్కడే చెత్తకుండీలో విసిరేశారు.